ప్రజాశక్తి

సోమవారం 2 డిసెంబర్ 2024 | 5 | అనంతపురం



విడపనకల్ వద్ద రోడ్డు ప్రమాదం

ముగ్గురు మృతి, ఒకరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

పూర్తి వివరాలు మెయిన్‌పేజీలో...



కదిలేదే లే...

ఆత్మకూరు మండలంలో ఫెవికాల్‌వీరులు
సంవత్సరాల తరబడి అక్కడే విధులు
ఆయా శాఖల్లో చక్రం తిప్పుతున్న వైనం

ప్రజాశక్తి - ఆత్మకూరు

ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీలు సహజమే. మూడేళ్లకో,ఐదేళ్లకొకసారి ఉద్యోగస్తుల బదిలీలు చట్టం ప్రకారం కావడం ఆనవాయితీ. అయితే అందుకు భిన్నంగా ఆత్మకూరు మండలంలో రెండు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఇద్దరు ద్వితియ శ్రేణి ఉద్యోగులు ఫెవికాల్‌వీరులుగా మారారు. వీరు ఆయా శాఖల్లో చక్రం తిప్పుతూ తమ హవా కొనసాగిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా ఆయా పార్టీ నాయకుల కనుసన్నల్లో విధులు నిర్వర్తిస్తూ, బదిలీ కాకుండా తమదైన శైలిలో చక్రం తిప్పుతున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. అందుకు సంబందించిన వివరాల్లోకి వెళితే ఆత్మకూరు మండల రెవెన్యూ శాఖలోని ఓ ద్వితియ శ్రేణి ఉద్యగి గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఇక్కడికి బదిలీ అయ్యారు. అప్పట్లో ఆ సామాజిక వర్గానికి చెందిన ఆ పార్టీ మండల నాయకులు కనుసన్నల్లో విధులు నిర్వహించాడు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి మండల నాయకులు ఆ అధికారిపై గుర్రుగా ఉండేవాడు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే ఆ అధికారిని బదిలీ చేయిస్తామని ప్రతినబూనారు. అయితే టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ అధికారి తన శైలిని మార్చుకున్నారు. ప్రస్తుత అధికార పార్టీ నాయకులతో సన్నిహితంగా ఉంటూ వారు చెప్పినట్లు నటిస్తూ బదిలీ కాకుండా ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆపార్టీ నాయకులకు అనుకూలంగా ఉంటూ కార్యాలయంలో చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అర్హులను అనర్హులుగాను, అనర్హులను అర్హులు గాను తప్పుడు నివేదికలు తయారుచేసి, అక్రమాలకు పాల్పడున్నారన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి.

ఇక స్థానిక పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ ద్వితియ శ్రేణి అధికారి వ్యవహర శైలి కూడా దాదాపు ఇలాగే ఉన్నట్లు తెలుస్తోంది. ఆ అధికారి అంటే ఇక్కడ అందరికీ హడలే.. ఆయన అవినీతి అక్రమాలకు అడ్డు లేకుండా పోయిందని మండలంలో పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్లో ఆయన చెప్పిందే వేదంగా నడుస్తోందన్న విమర్శలు ఉన్నాయి. అక్రమంగా డబ్బు సంపాదన కాకుండా, తమ బంధువుల పేరు మీద స్థిరాస్తులు కూడా సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకోవటం స్టేషన్‌కు తరలించకుండా వేలాది రూపాయలు వారితో దండుకోవటం లాంటి కార్యక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. స్టేషన్‌కు ఎందరు అధికారులు మారినా ఆయన మాత్రం ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు దొరికామంటే ఇక డబ్బులు కట్టాల్సిందేనని వాహన చోదకులు, ఆటో డ్రైవర్లు హడలెత్తిపోతున్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా వీరు తమ హవాను కొనసాగిస్తున్నా వీరి బదిలీల సంగతి మాత్రం ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోకపోవటం ఆశ్చర్యంగా ఉందన్న అభిప్రాయాల్లో స్థానికుల్లో వినిపిస్తున్నాయి. ఏ ప్రభుత్వం మారినా, ఏ అధికారి వచ్చినా 'మేం కదిలేదే లే' అనే ధీమాతో ఈ అధికారులు ఉన్నారన్న వ్యాఖ్యానాలు స్థానికుల్లో వినిపిస్తున్నాయి.



ఆత్మకూరు తహశీల్దార్ కార్యాలయం



ఆత్మకూరు పోలీసుస్టేషన్

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్
ఘనంగా యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ విద్యా రంగాన్ని పరి రక్షించుకోవడానికి ప్రభుత్వాలతో పాటు ఉపాధ్యాయులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా సర్ణోత్సవ మహాసభలు ఆదివారం రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను యుటిఎఫ్ సీనియర్ నాయకురాలు లక్ష్మమ్మ ఎగురవేయగా, ఎస్‌టిఎఫ్ జెండాను యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్, యుటిఎఫ్ జెండాను రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, వారి గొంతుకగా యుటిఎఫ్ నిలవడం అభినందనీయమన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం విద్యా రంగం బలోపేతానికి కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. జాతీయ నూతన విద్యా విధానం అమలుతో కొంత సమస్యలు ఉత్పన్నమయ్యాయని వాటిని ప్రభుత్వాలు సరి చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. యుటిఎఫ్ విద్యాభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు అనేక పోరాటాలు చేస్తోందన్నారు. యుటిఎఫ్‌లో పని చేసే ప్రతి వ్యక్తి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యాభివృద్ధికి పని చేస్తున్నారని అభినందించారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ నవ్యాంధ్రలో లక్ష సభ్యత్వం కలిగి అతి పెద్ద సంఘంగా యుటిఎఫ్ నిలిచిందన్నారు. 2025 జనవరి 5, 6,7, 8 కాకినాడలో నిర్వహించే యుటిఎఫ్ రాష్ట్ర సర్ణోత్సవ మహాసభలకు అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ యుటిఎఫ్ భవిష్యత్‌లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి జేఏసిలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ యుటిఎఫ్ జిల్లా సర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.వీరేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, సిఐటియు రాయదుర్గం కార్యదర్శి మల్లికార్జున, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు శివ, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి.రమణయ్య, సహాధ్యక్షులు రామప్ప చౌదరి, ఎన్.సరళ, కోశాధికారి రాఘవేంద్ర, కార్యదర్శులు ప్రమీళ, హనుమంతరెడ్డి, రవికుమార్, సంజీవ్ కుమార్, శేఖర్, వహబ్‌ఖాన్, అర్జున్, రాష్ట్ర కౌన్సిలర్‌లు ఈశ్వరయ్య, దేవేంద్రమ్మ, ఆడిట్ కమిటి కన్వీనర్ సుబ్బరాయుడు, సభ్యులు వై.వెంకట్రామిరెడ్డి, జి.రామాంజినేయులు, గంగాధర తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా యుటిఎఫ్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎస్‌వివి.రమణయ్య, జిల్లా అధ్యక్షులుగా గోవిందరాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా లింగమయ్య, జిల్లా సహాధ్యక్షులుగా రామప్పచౌదరి, ఎన్.సరళ, కోశాధికారిగా రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శులుగా ప్రమీళ, హనుమంతరెడ్డి, రవికుమార్, సంజీవకుమార్, శేఖర్, వహబ్‌ఖాన్, అర్జున్, సుబ్బరాయుడు, వై.రాముడు, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఈశ్వరయ్య, దేవేంద్రమ్మ, ఆడిట్ కమిటి కన్వీనర్‌గా చంద్రమోహన్, జిల్లా కౌన్సిలర్‌గా వై.వెంకటరామిరెడ్డిని ఎన్నుకున్నారు.

రాయదుర్గం అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తాం



విలేకరులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గం సమగ్ర అభివద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టమైన హామీ ఇచ్చారని ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తామని రాయదుర్గం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చెప్పారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేమకల్లులో జరిపిన సిఎం పర్యటన విజయవంతం కావటానికి కృషి చేసిన అధికారులు, పార్టీ నాయకులు, ప్రజలుకు కృతజ్ఞతలు తెలిపారు. సిఎం పర్యటన రాయదుర్గం అభివృద్ధికి బలంగా తోడ్పడుతుందని అన్నారు. సీఎం భరోసాతో బాధ్యతాయుతంగా ఆత్మవిశ్వాసంతో పనిచేస్తామని చెప్పారు. సిఎం రాయదుర్గం పర్యటనతో నియోజకవర్గానికి, జిల్లాకు పలు ప్రయోజనాలు చేకూరానున్నాయన్నారు. ఉంతకల్లు సమీపంలో ఐదు టీఎంసీల సామర్థ్యం గల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి డిపిఆర్ నాలుగున్నర కోట్ల రూపాయల కేటాయింపుతో స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో లక్ష ఎకరాల భూములకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరగా అందుకు అంగీకరించినట్లు తెలిపారు.

హెచ్‌ఐవిపై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రతి పౌరుడు హెచ్ఐవి పట్ల అవగాహన కలిగి ఉండాలనిపార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఆదివారం జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సంయుక్తంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆర్ట్స్ కాలేజ్ నుంచి ప్రారంభమై టవర్ క్లాక్, సుభాష్ రోడ్డు మీదుగా సప్తగిరి సర్కిల్‌కు చేరుకుంది. సప్తగిరి సర్కిల్ లో మానవహారంగా ఏర్పడి హెచ్ఐవి నియంత్రణకు పాటుబడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెచ్ఐవి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం హెచ్ఐవి జిల్లాలో తగ్గుముఖం పట్టిందని, హెచ్ఐవి పూర్తిగా నిర్మూలించడానికి వైద్య ఆరోగ్యశాఖ తోపాటు మిగతా అన్ని శాఖలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దేవి మాట్లాడుతూ డిసెంబర్ 1న ప్రపంచవ్యాప్తంగా ఎయిడ్స్ దినం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని, హెచ్ఐవి పట్ల ప్రజలందరికీ అవగాహన కలిగించేందుకు హెచ్ఐవితో ప్రభావితమైన కుటుంబాలకు బాసటగా నిలిచేందుకు ప్రపంచ ఎయిడ్స్ రోజు ఉపకరిస్తుందని తెలిపారు. ర్యాలీ అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సమావేశ భవనంలో ఉత్తమ సేవలు అందించిన హెచ్ఐవి కేంద్రాలకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. ఈ ర్యాలీలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి అనుపమ జేమ్స్, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా సూపర్‌వైజర్ జీవీ రమణ, డిస్ట్రిక్ న్యూక్లియస్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్ రెడ్డి, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ పద్మశ్రీ, ఆర్ఆర్‌సి కోఆర్డినేటర్ గిరిధర్, అనంత నెట్‌వర్క్ ప్రెసిడెంట్ వీరాంజనేయులు, రామకృష్ణారెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ సుజాత, డెమో త్యాగరాజ్, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్, రైడ్స్ క్రిష్టప్ప, హెచ్ఒ సత్యనారాయణ, పిఎంఓ నాగన్న, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, రైడ్స్ సిబ్బంది, లింక్ వర్కర్లు, ఎన్‌వైకె, ఆర్ఆర్‌సి, ఇండియన్ రెడ్ క్రాస్, ఆర్ట్స్ కాలేజ్, ఎస్-ఎస్‌బిఎన్ కాలేజ్, వివిధ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాకు నాలుగు రాష్ట్ర స్థాయి అవార్డులు

ప్రపంచ ఎయిడ్స్ దినం 2024 సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు నాలుగు అవార్డు లభించాయి.పరీక్షల నిర్వహణ విభాగంలో అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఐసీటీసీకి, హెచ్ఐవి వ్యక్తులకు ఉత్తమ సేవలు గాను అనంతపురం ఎటిఆర్ సెంటర్‌కు, తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవి సంక్రమించకుండా తీసుకునే చర్యలకు గాను బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి రక్త సేకరణ, అత్యధిక స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకుగాను హిందూపురం రక్తనిధికి రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కాయి.

డబ్బు మీకు.. గబ్బు ప్రజలకా..?

మేయర్‌కు టిడిపి సూటిప్రశ్న


ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గత ఐదేళ్ల వైసిపి పాలనలో అవినీతి డబ్బు అంతా ఆ పార్టీ నాయకులకు.. వీధుల్లో గబ్బు అంతా ప్రజలకు మిగిలిందని మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్‌అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర నేత తాజుద్దీన్, మైనార్టీ నేత ముస్తాక్ విమర్శించారు. ఆదివారం నగరంలోని అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మేయర్ వసీంతో పాటు ఆయన్ని వెనక ఉండి నడిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అవినీతి త్వరలోనే బయటపడుతుందని హెచ్చరించారు. రూ.22 కోట్లతో డంపింగ్ యార్డులో చెత్త క్లియర్ చేస్తామని చెప్పి ఒక హైదరాబాద్ చెందిన కంపెనీకి బిల్లులు చేయించారన్నారు. అయితే చెత్త ఎక్కడ శుభ్రం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కమీషన్ ఎవరికి పోయిందో అందరికీ తెలుసన్నారు. చివరికి నీటిని శుద్ధి చేసే దాంట్లో కూడా అవినీతి చేసే మూడు నెలలపాటు నగర ప్రజలకు మురికి నీరు తాగించారని ఆరోపించారు. ఏదైనా మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. మేయర్ వసీం తన స్థాయి మరిచి ఎమ్మెల్యే దగ్గుపాటితోపాటు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి, టిడిపిపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో తాము చర్చకు సిద్ధమన్నారు.

'బాబూ.. మాట నిలబెట్టుకో...'

విద్యుత్-ఛార్జీల పెంపుతో ప్రజలపై పెనుభారం
వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం



ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రసంగాన్ని విన్పిస్తున్న 'అనంత'

అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలు నియంత్రిస్తాం..విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తాం అని చెప్పిన మాటను సిఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తానని చెప్పిన చంద్రబాబు ఐదున్నర నెలల్లో ప్రజలపై ఏకంగా రూ.15485 కోట్ల భారం వేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో చంద్రబాబు మాట్లాడిన వీడియోను ప్రదర్శించారు. ప్రజలు నమ్మి ఓటు వేస్తే వాళ్ల నడ్డి విరిచేలా కరెంట్ చార్జీలు పెంచడం తగదన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు పెరిగాయని, విద్యుత్ ఛార్జీల పెంపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు పెనుభారంగా మారుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీపావళి పండుగ సమయంలో రూ.6072 కోట్ల భారం వేశారని, ఇప్పుడు మరో రూ.9412 కోట్ల భారం వేస్తున్నారని విమర్శించారు. తక్షణం విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు నెలకు వెయ్యి రూపాయల విద్యుత్ బిల్లు వచ్చే ఇంటికి.. ఇకపై సుమారు రూ.1500 నుంచి రూ.1600 వరకు బిల్లు వస్తుందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయంపై ఇప్పటికే వామపక్షాలు ఉద్యమిస్తున్నాయన్నారు. తాము కూడా ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని నేమకల్లుకు వచ్చిన సిఎం చంద్రబాబు 5 టీఎంసీలతో ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణంతో పాటు హెచ్ఎల్‌సీ ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామని చెప్పడాన్ని జిల్లా వాసిగా స్వాగతిస్తున్నానన్నారు. అయితే ఇది మాటలకే పరిమితం చేయొద్దని అన్నారు. చంద్రబాబు తీరు ఏరు దాటే వరకు ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న అనే రకంగా ఉంటుందని ఈ మాటను గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చెప్పేవారని.. ఆ అపవాదును తొలగించుకోవాలని సూచించారు. బెల్ట్ తీసినంత ఈజీ కాదు.. మీ బెల్ట్ మాఫియాను తీయడం అని వ్యాఖ్యానించారు. అనంతపురం జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందన్నారు. బూడిద కోసం రెండు జిల్లాల పోలీసులను ఆర్టీపీపీ, బార్డర్లలో బందోబస్తు పెట్టారంటే ఇంతకన్నా సిగ్గుచేటు మరొకటి ఉంటుందా అని అన్నారు.

గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె.మోహన్‌రామ్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ల దాటుతున్నా ఇంకా కొన్ని మారుమూల గిరిజన గ్రామాలు సరైన మౌలిక సదుపాయాలకు నోచుకోలేదు. ప్రధానంగా రహదారులు, తాగునీరు, విద్యుత్, రవాణా సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న గిరిజన తండాలు, ఎరుకుల, యానాది తదితర వెనుకబడిన గిరిజన ఆవాసాలు ఉన్నాయి. గిరిజన ఆవాసాల గ్రామాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికంగా కూడా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా గిరిజనులు వారి పిల్లలు పథకాలను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు గురించి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె. మోహన్ రామ్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు. గిరిజనుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె. మోహన్ రామ్ పేర్కొన్నారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని గిరిజన ఆవాస గ్రామాలున్నాయి.? అందులో అత్యంత వెనుకబడినవి ఎన్ని.?

జవాబు : జిల్లా వ్యాప్తంగా 450 గిరిజన ఆవాస గ్రామాలు ఉన్నాయి. ఇందులో ఏడు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేనట్లుగా గుర్తించాం. రహదారులు, నీటి సదుపాయాలు, కల్పించడానికి తగు చర్యలు తీసుకుంటున్నాము. ఈ ఏడు ఆవాస గ్రామాలు ముదిగుబ్బ మండలం బత్తలపల్లితో పాటు మడకశిర, కదిరి నియోజకవర్గాలలో ఉన్నాయి. వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వానికి నివేదిక పంపాం.



ప్ర : గిరిజనులకు కల్పిస్తున్న రుణ సదుపాయాలేవి ?

జ : గిరిజనుల అభివృద్ధి కోసం 60 యూనిట్లు గుర్తించాం. వాటిలో గొర్రెలు, పాడి పశువులు, ట్రాక్టర్లు, బొలెరా వాహనాలు. వీటిని అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. గిరిజన పాఠశాలల అభివృద్ధికి తగిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాం.

ప్ర : గిరిజన విద్యార్థులు ఎంతమంది ఉన్నారు.? వారికి ప్రత్యేక పాఠశాలలు ఎన్ని ఉన్నాయి.?

జ : జిల్లాలో దాదాపు 1900 మంది గిరిజన విద్యార్థులు ఉన్నారు. వారికోసం ప్రత్యేక పాఠశాలలు ఉన్నాయి. ఒక ఆశ్రమ పాఠశాల, ఆరు గురుకుల పాఠశాలలు, ఐదు వసతిగృహాలు ఉన్నాయి. వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోంది. స్కాలర్‌షిప్‌ల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం.

ప్ర : సమగ్ర గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

జ: సమగ్ర గిరిజన అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం జిల్లాలో 3 గ్రామాలను ఎంపిక చేసింది. మారుమూల గ్రామాలైన వాటిలో పూర్తిగా మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం. సోమందేపల్లి మండలం నాగినాయుని చెరువు తండా, తనకల్లు మండలంలో ముండ్ల వారి పల్లి, గాండ్లపెంట మండలంలో తుమ్మల బైలు గ్రామాలు ఎంపికయ్యాయి. వీటిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం. అందుకు కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేయనుంది. వాటిలో గృహ నిర్మాణం, తాగునీటి సౌకర్యం, రహదారులు, విద్య, వైద్య సౌకర్యాలు ఇలా 17 రకాల అభివృద్ధి పనులు, మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం. వీటిపై ఆయా శాఖల ద్వారా పర్యవేక్షణ ఉంటుంది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆదర్శ గ్రామాలుగా తీర్చించడం జరుగుతుంది.

ప్ర : మీశాఖలో సిబ్బంది కొరత ఉందా.? గిరిజనులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

జ : సిబ్బంది కొరత ఏమీ లేదు. అభివృద్ధి పనులు ఆయా శాఖల పర్యవేక్షణలో జరుగుతాయి. తమ శాఖ ఆయా గిరిజన గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతుంది. గతంతో పోల్చుకుంటే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. మారుతున్న సమాజానికి అనుగుణంగా అవసరాలు కూడా పెరుగుతుంటాయి. గిరిజనులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందుకొని వాటిని సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి చెందాలి.



జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె. మోహన్ రామ్

ప్రజాశక్తి
www.prajasakti.com

వక్ఫ్ బోర్డు బిల్లును వ్యతిరేకించాలని వినతి



ఎంపి అంబికాను సన్మానిస్తున్న ఆల్‌మేవా నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

పార్లమెంటు సమావేశంలో వక్ఫ్‌బోర్డు ఆస్తుల బిల్లును టిడిపి తరుపున వ్యతిరేకించాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్‌మేవా) నాయకులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు విన్నవించారు. ఆదివారం అనంతపురంలోని ఎంపీ స్వగృహంలో అంబికా లక్ష్మీనారాయణను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో వక్ఫ్ బోర్డు బిల్లుకు టిడిపి తరపున బిల్లు ప్రవేశ పెట్టకుండా వ్యతిరేకించాలని కోరారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల ఆదాయం ద్వారా సమాజంలోని పేద విద్యార్థులను ప్రోత్సహించడం, ముస్లిం శ్మశాన వాటికల అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం వినియోగిస్తున్నామన్నారు. ఇలాంటి తరుణంలో ఒక బోర్డు బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం అన్యాయం అన్నారు. కావున టిడిపి ఎంపీలు దాన్ని వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఉద్యోగుల సంక్షేమం జిల్లా అధ్యక్షులు షేక్షావలి, జిలాన్, అబ్దుల్ రసూల్, మహబూబ్‌బాషా, దౌలా, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి




విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ప్రజలపై ఎలాంటి విద్యుత్ ఛార్జీల భారం పడకుండా చూస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఆరునెలలు తిరగకుండానే ప్రజలకు వాతలు పెడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.9,000 కోట్ల భారం మోపడం బాధాకరమన్నారు. ఇప్పటికే ఒకసారి దీపావళి అప్పుడు రూ.6,072 కోట్ల భారం వేశారన్నారు. సంపద సృష్టించడం అంటే ప్రజలపై భారం మోపడం.. అప్పులు చేయడమేనా.. అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ చేసిన రూ.67,237 కోట్లకు చేరిందన్నారు. ఓవైపు ప్రజలపై విద్యుత్ ఛార్జీలు భారం మోపుతూ.. మరోవైపు రాష్ట్రాన్ని అప్పులు పాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సిఎం చంద్రబాబు స్పందించి ప్రజలపై భారాలు మోపకుండా చూడటంతోపాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



ఆదినారాయణను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

నగరంలోని మాసినేని గ్రాండ్‌లో రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఇచ్చినందుకు టిడిపి అధిష్టానం, సహకరించిన జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తన ఎదుగుదలకు సహకరించిన దండు శ్రీనివాసులు సహాయ, సహకారాలు మరువలేనివి అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కుళ్లాయప్ప, బండి పరశురాం, బెస్త నారాయణస్వామి, దేరంగుల శంకరయ్య, దండు సతీష్, కాయల సురేష్‌యాదవ్, దండు ప్రకాష్, కల్లుమడి నల్లప్ప, రంగస్వామి, సోమప్ప, పుల్లయ్య, వెంకటప్ప, తాడిమర్రి సురేంద్ర, ఐ టిడిపి ఛాంపియన్ మునీంద్ర, బాబావలి, కాయల శివశంకర్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హామీలు అమలు చేయకుండా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, డీఎస్సీ విడుదల చేయాలని, నియోజకవర్గంలోని 114 చెరువులకు నీరివ్వాలని, బిటిపి కాలువలకు భూములు కోల్పోయిన బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ప్రజలపై విద్యుత్ భారం తగదు

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విద్యుత్ భారం మోపడం తగదనిశాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని కొనకొండ్ల గ్రామంలో ఉన్న తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి ప్రజలకు నయవంచనకు పాల్పడ్డారన్నారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడవకుండానే దాదాపు రూ.15,485 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపడం బాధాకరమన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం ద్వారా నిత్యావసర సరుకులు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. మాట తప్పడం, సమస్య వచ్చినప్పుడల్లా ప్రజల దృష్టి మళ్లించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇందుకు విద్యుత్ ఛార్జీల పెంపే ఉదాహరణ అన్నారు. తాను విద్యుత్ ఛార్జీలు పెంచుతూ మాజీ సిఎం జగన్‌పై మోపడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు స్పందించి ప్రజలపై భారాలు వేయడం మానుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు కాకర్ల నాగేశ్వరరావు, తిప్పారెడ్డి, రమణాయాదవ్, రమణారెడ్డి, జయచంద్రనాయుడు, జయేంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి, ఆమిద్యాల చెన్నబసన్నగౌడ్, శివలింగ, తిరుపాల్‌యాదవ్, బోయ రాంబాబు, దిద్దేకుంట సూరి, మహాలింగ, రామచంద్ర, లాలెప్ప, గురుస్వామి, కేశన్న, ముస్టూరు ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

యల్లనూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరుకానున్నట్లు తెలిపారు. కావున ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే ప్రజావేదికకు వచ్చిన విన్నవించుకోవాలని కోరారు.

13, 14న జాబ్‌మేళా

కళ్యాణదుర్గం రూరల్ : నియోజకవర్గం ప్రాంత యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈనెల 13, 14వతేదీల్లో కళ్యాణదుర్గంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి టెన్త్ క్లాస్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బీ టెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులు బీమా ప్రీమియం చెల్లించండి

యల్లనూరు : మండలంలో పంటలు సాగు చేసిన రైతులు బీమా ప్రీమియం చెల్లించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్ వరకూ ప్రభుత్వమే ప్రీమియం చెల్లించిందని, అయితే రబీ సీజన్ నుండి రైతులే ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు చేసిందన్నారు.

ముమ్మరంగా బిటిపి కుడి కాలువ పనులు

రూ.23లక్షలతో 13.8 కి.మీ పనులు -రెండు, మూడు రోజుల్లో పూర్తి-గుత్తేదారుడికి ఎమ్మెల్యే ప్రశంస



ముమ్మరంగా సాగుతున్న పనులు

ప్రజాశక్తిబ్రహ్మసముద్రం

బ్రహ్మసముద్రం మండలంలో తాగు, సాగు నీరు అందించే ఏకైక ప్రాజెక్టు భైరవానితిప్ప ప్రాజెక్టు. కర్ణాటక ఎగువ ప్రాంతం నుంచి భారీ వరద రావడంతో నీటితో జలాశయం జలకళలాడుతోంది. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక చొరవతో సీఎం చంద్రబాబుతో మాట్లాడి జలాశయం కుడి కాలువ పనులకు దాదాపు రూ.23 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆయా పనులను గుత్తేదారు, బిటిపి కుడి కాలువ ఆయకట్టు మాజీ ఛైర్మన్ సుభాన్‌కు అప్పగించారు. ఎమ్మెల్యే చొరవతో గుత్తేదారుని దృఢ సంకల్పంతో నెలక్రితమే పనులను ప్రారంభించారు. పోలేపల్లి నుంచి గుండిగానిపల్లి వరకూ 60 అడుగుల లోతు ఉంటుంది. జెసిబి, హిటాచీలు సైతం లోపలికి వెళ్లలేని దుస్థితిలో గుత్తేదారుడు ప్రత్యేక శ్రద్ధతో కాలువలోనికి జెసిబి, హిటాచిని దించి ట్రాక్టర్ల సహాయంతో 16 రోజులు శ్రమించి పూడికను తీయించారు. ఈ దృశ్యాన్ని చూడడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం వీక్షించాలరంటే పనులు ఎలా జరిగాయో అర్థం అవుతుంది. అనతికాలంలోనే దాదాపు 10 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేశారు. 90 శాతం కాలువ పనులు పూడికతీత పూర్తి చేసిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు గుత్తేదారును ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకుని అభినందించారు. ఇంత త్వరగా త్వరితగతిన కాలువ పనులు పూర్తి చేయడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. ప్రాజెక్టు పుట్టిన నాటి నుండి ఇప్పటివరకు ఇలాంటి పనులు జరగలేదని ప్రజలను ప్రశంస జల్లులు కురిపించారు.

ఎమ్మెల్యే సురేంద్రబాబుకు కృతజ్ఞతలు : గుత్తేదారు సుభాన్



నాపైనమ్మకం ఉంచి కాలువ పనుల బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రజలకు ఎమ్మెల్యే ఇచ్చిన మాట మేరకు నెలరోజులు శ్రమించి, ఎన్నో వ్యయ, ప్రయాసాలకోర్చి కాలువ పుడికతీత పనులు చేశానన్నారు. నా కష్టాన్ని గుర్తించి స్వయంగా ఎమ్మెల్యే పనుల ప్రగతిని పరిశీలించి అభినందించి సన్మానించడం జీవితంలో మరువలేని దృశ్యం. కళ్యాణదుర్గం అభివృద్ధి ఎమ్మెల్యే ఆమిలినేని సురేంద్రబాబుతోనే సాధ్యమం. త్వరలోనే వందశాతం పనులు పూర్తి చేస్తా..

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం

సేవాఘడ్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి అశ్వర్థనాయక్



జిసిసి డైరెక్టర్లను సన్మానిస్తున్న ఎఐబిఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గిరిజన, బంజారాల సమస్యల పరిష్కారంతోపాటు హక్కుల సాధనకు ఐక్యమత్యంగా పని చేద్దామని సేవాఘడ్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి సి.అశ్వర్థనాయక్, ఆలిండియా బంజారా సేవాసంఘ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకట రమణానాయక్, చక్రినాయక్ పిలుపునిచ్చారు. ఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీనాయక్, పి.బాబునాయక్ అధ్యక్షతన ఆదివారం నగరంలోని 2వరోడ్డు బంజారా భవన్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బంజారాలు నివసిస్తున్న తండాల్లో ఇప్పటికీ అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ సమస్య కూడా ఉందన్నారు. పాలక ప్రభుత్వాల దృష్టికి మన సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేద్దామని తెలిపారు. రాయలసీమ అత్యధికంగా బంజారాలు నివసిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాజకీయంగా అవకాశాలు ఇవ్వడంలో రాజకీయ పార్టీలు జాప్యం చేస్తున్నాయని, బంజారాలు ఎక్కువగా ఉన్న జిల్లాలో ఒక ఎమ్మెల్యే, లేక, ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని కోరారు. ఇకపోతే 2025 జనవరి 26న సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ శాంతి సద్భావన యాత్రకు బంజరాలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేవాఘడ్ ట్రస్ట్ కోశాధికారి బాలానాయక్, శేఖర్‌నాయక్, గోరంట్ల జడ్పిటిసి పాలే జయరాంనాయక్, రచయిత క్రిష్ణానాయక్, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్లు అరుణ్‌కుమార్ నాయక్, రమేష్‌నాయక్, ఎఐబిఎస్ఎస్ యూత్ వింగ్ ప్రెసిడెంట్ రామాంజినాయక్, కిరణ్‌కుమార్ నాయక్, వెంకటరమన నాయక్, నరేష్‌నాయక్, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు సుగుణాబాయి, శివమ్మ, చంద్రకళా బాయి (నాయకన్), ఈశ్వరీబాయి, అశోక్ నాయక్, జిల్లా కార్యవర్గం, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.

జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీ



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ శరత్‌చంద్ర

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు ఆదివారం విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ప్రజల భద్రత, రక్షణలో భాగంగా అన్ని ముఖ్య కూడళ్లు, జనం రద్దీగా ఉండే ప్రదేశాలు, రహదారులపై సంచరిస్తూ వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణ, నేరాల కట్టడిపై నిఘా, రోడ్డు సేఫ్టీ నియమాలపై ప్రజల్లో అవగాహన, తదితర చర్యలు చేపట్టారు.

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామ సమీపంలో ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా అధిక లోడుతో వెళ్తున్న వాహనాలు డ్రైవింగ్ లైసెన్స్ రికార్డులు లేని వాహనాలకు అపరాధ రుసు విధించినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం ఎస్సై వాహనదారులతో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ రోడ్డు మీద ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలన్నారు. ఆటో వాళ్లు అధిక లోడుతో వెళ్లకుండా డ్రైవింగ్ లైసెన్స్ రికార్డులు ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ శరత్‌చంద్ర సూచించారు. సీఐ కౌలుట్లయ్య ఆదేశాల మేరకు ఆదివారం శింగనమల-గార్లదిన్నె రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ వాహనాలను నడపకూడదన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని, పరిమితికి మించి ప్రయాణికులను తరలించకూడదని, వాహనాలకు సంబంధించిన రికార్డులను వాహనాల్లోనే ఉంచుకోవాలని సూచించారు.




పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

ఆసుపత్రికి వెళ్లి పింఛను పంపిణీ

పుట్లూరు : మడుగుపల్లికి చెందిన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజశేఖర్ ఆసుపత్రికి వెళ్లి బాధితురాలికి పింఛన్ సొమ్ము అందజేశారు. మండల పరిధిలోని మడుగుపల్లి గ్రామానికి చెందిన గవ్వల సరస్వతీ అనారోగ్యంతో అనంతపురంలోని పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజశేఖర్ ఆదివారం సెలవు అయినప్పటికీ ఆసుపత్రికి వెళ్లి బాధితురాలికి పింఛన్ అందజేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపకార వేతన అర్హతకు మాదిరి పరీక్ష

ఉరవకొండ : ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ ఉపకార వేతన అర్హత పరీక్షను ఆదివారం శ్రీ కరిబసవ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. నిస్వార్థ ఫౌండేషన్, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షకు దాదాపు 130 మంది దాకా విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట్, స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు విజయ్‌భాస్కర్, ఉపాధ్యాయులు ఎర్రిస్వామి, బాషా, నిస్వార్థ ప్రతినిధులు ముక్తమ్, శ్రీనివాసులు, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

జిసిటిఎ జిల్లా అధ్యక్షులుగా కోనంకి శ్రీధర్



ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘం (జిసిటిఎ) జిల్లా అధ్యక్షులుగా కోనంకి శ్రీధర్ ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో జిసిటిఎ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమీప ప్రత్యర్థి వెంకటేష్‌పై 50 ఓట్ల మెజారిటీతో శ్రీధర్ గెలిచారు. అలాగే ఉమెన్ సెక్రటరీగా డాక్టర్ శ్రీలేఖ 28 ఓట్లతో విష్ణుప్రియపై గెలుపొందారు. జిల్లా కార్యదర్శిగా బాలాజీనాయక్, జిల్లా ట్రెజరర్‌గా డాక్టర్ నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా పెనుగొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జయప్ప వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన జిసిటిఎ కార్యవర్గానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.పద్మశ్రీ తెలిపారు.

టిడిపి సీనియర్ కార్యకర్తకు నివాళి

కళ్యాణదుర్గం రూరల్ : మృతిచెందిన మండలంలోని మోరేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త చౌళం గురుస్వామి మృతిచెందడంతో ఎమ్మెల్యే అల్లుడు దేవినేని ధర్మతేజ ఆదివారం నివాళు లర్పించారు. మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. తర్వాత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని కరణం చిక్కప్ప పాఠశాలలో రాష్ట్రస్థాయి మెన్ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాజట్టును ఆదివారం ఎంపిక చేసినట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ సాకే శివశంకర్ తెలిపారు. పోటీలకు ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా దాదాపు 120 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ప్రస్తుతం ఎంపిక చేసిన జిల్లా జట్టు త్వరలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ మురళి, పిఇటిలు శివ, కుళ్లాయిస్వామి, రమేష్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు నివాళి

పామిడి : గార్లదిన్నె మండలం తలగాచిపల్లి క్రాస్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారికి ఆదివారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్ ఆవరణలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరిత దివ్యాంగులసేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు బి.మోహన్‌నాయక్ మృతుల కుంటుంబాలకు రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, బాధిత కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రమేష్, రాజు, శ్రీనివాస్, రామ్, రామకృష్ణ, అంజి, అంజనేయులు, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



విజేత క్రికెట్ జట్టుతో అతిథులు

అండర్-12 క్రికెట్ లీగ్ పోటీలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని కరణం చిక్కప్ప స్కూల్ ఆవరణలో ఆదివారం అండర్-12 క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి మ్యాచ్ ఆత్మకూరు-కళ్యాణదుర్గం జట్లు పోటీ పడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆత్మకూరు జట్టు 20 ఓవర్లలో 96 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కళ్యాణదుర్గం జట్టు కేవలం 36 పరుగులకే ఆలౌట్ అయింది. తర్వాత 2వ మ్యాచ్ సందర్భంగా ఆత్మకూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో మొదట మరోసారి బ్యాటింగ్‌కు దిగిన ఆత్మకూరు జట్టు 67 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 47 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి పాలైంది. దీంతో ఆత్మకూరు జట్టు ఫైనల్‌కు చేరుకుంది.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కనకదాస విగ్రహ ప్రతిష్టాపన

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని కదరంపల్లి గ్రామంలో కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాస విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠంచనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గంలోని కురుబలు భారీగా తరలివచ్చిన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భవనాసి ప్రదీప్‌కుమార్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రానికి చెందిన భవనాసి ప్రదీప్‌కుమార్‌కు యోగి వేమన యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రదీప్‌కుమార్ ధర్మవరంలోని ప్రభుత్వ పాల్ టెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనేపథ్యంలో కడప జిల్లా యోగి వేమన యూనివర్సిటీలో 'డిపార్ట్మెంట్ ఆఫ్ అప్లైడ్ మ్యాథమెటిక్స్' విభాగంలో పరిశోధన చేసినందుకు వర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ప్రదీప్‌కుమార్ గేట్ 2010 ఎంట్రెన్స్‌లో ఆలిండియాలో 18వర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, సహకారంతో విజయవంతంగా పిహెచ్‌డి పూర్తి చేసినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ యువకుడు మృతి



మృతిచెందిన సురేష్

బెలుగుప్ప: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాలైన సురేష్ (24) కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం సునీల్‌రెడ్డి కాలనీ చెందిన సురేష్, స్నేహితుడు ముషీర్ కలిసి వారి అమ్మమ్మ ఊరు గోళ్లకు నవంబర్ 24న వచ్చారు. తిరిగి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా కాలవపల్లి సమీపంలో అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వీరిలో సురేష్ పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం పరిస్థితి విషమించి మృతిచెందాడు.

బాలుడు గల్లంతు



బాలుడు గల్లంతుపై అధికారులతో మాట్లాడుతున్న సర్పంచి పార్వతి

బుకరాయసముద్రం : మండల కేంద్రంలోని ఐలమ్మ కాలనీ వద్ద హెచ్చెల్సీలో బాలుడు మోహన్‌సాయి (10) గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఐలమ్మ కాలనీకి చెందిన మనోహర్, పద్మావతి కుమారుడు మోహన్‌సాయి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈత కొట్టేందుకు మరో ఇద్దరితో కలిసి హెచ్చెల్సీ వద్దకు వెళ్లారు. వీరిలో మోహన్‌సాయితోపాటు మరో అబ్బాయి నీటిలో దిగాడు. ఒకబ్బాయి బయటకు రాగా మోహన్‌సాయి నీటిలో కొట్టుకుపోయాడు. భయపడిన తోటి పిల్లలు కాలనీకి వచ్చిన చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులతోపాటు పోలీసులు, సర్పంచి పార్వతి కలిసి కాలువ వెంబడి గాలించారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు.

రేషన్‌బియ్యం పట్టివేత

అనంతపురం క్రైం : అక్రమంగా తరలిస్తున్న 11.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు త్రీ టౌన్ సిఐ కె.శాంతిలాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు స్థానిక రాజీవ్ కాలనీ సర్వీస్ రోడ్డు నాగులకట్ట వద్ద సీఐ శాంతిలాల్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 11.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మజ్జిగ హరికృష్ణ అనే వ్యక్తి గుత్తి, గుంతకల్లు సమీప గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమంగా కర్నాటకలోని కోలార్ కి తరలిస్తున్నట్లు తెలిపారు. రామకృష్ణతోపాటు, డ్రైవర్ సాకే ప్రసన్నకుమార్, ఈశ్వరయ్యలను అరెస్టు చేసి, వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పేకాటజూదరులు అరెస్టు

అనంతపురం క్రైం : స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు సీఐ కె.శాంతిలాల్ తెలిపారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు నగర డీఎస్పీ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయుడు లాడ్జిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సీఐ సిబ్బందితో దాడి చేసి14 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3,85,960 నగదు, 12 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నాటుసారా ఊట ధ్వంసం

కళ్యాణదుర్గం రూరల్ : నియోజకవర్గ పరిధిలోని కంబదూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రాళ్లపల్లి గ్రామ శివార్లలో సుమారు 600 లీటర్ల నాటుసారా ఊటను ఆదివారం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అదేవిధంగా డి.చెన్నెపల్లి గ్రామంలో ఆనంద్ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి 34 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

కళ్యాణదుర్గం రూరల్ : కంబదూరు మండలంలోని తిమ్మాపురం గ్రామ చివరలో ఉన్న బ్రహ్మంగారి స్వామి ఆలయంలో శనివారం రాత్రి ఆలయ తలుపులను పగులగొట్టి హుండీలోని నగదు, వెండి అభరణాలను చోరీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి భర్త హరినాథ్ తెలిపిన వివరాల మేరకు... ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లి పగులగొట్టి అందులోని సుమారు రూ.40వేల వరకూ నగదుతోపాటు వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారన్నారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హెచ్ఐవిపై అవగాహన ఉండాలి

వ్యాధిగ్రస్తులపై వివక్ష వద్దు -నివారణ దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, అప్పుడే వ్యాధి నివారణ సాధ్యమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, డెర్మటాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ సప్తగిరి సర్కిల్ వరకు సాగి తిరిగి సాయినగర్ మీదుగా మెడికల్ కళాశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదన్నారు. వారితో ప్రేమపూర్వకంగా మెలిగి, ఆత్మ ధైర్యాన్ని నింపాలని పిలుపునిచ్చారు. ప్రతి హెచ్ఐవి రోగికీ ఎఆర్‌టి మందులు, చికిత్స నాణ్యమైన పద్ధతిలో ఉత్తమంగా అందిస్తూ రాష్ట్రంలోనే జిల్లా ప్రభుత్వాసుపత్రి సిబ్బందికి రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తెలుగు మధుసూదన్, డెర్మటాలజీ ప్రధాన విభాగాధిపతి వేదాంతం కిషోర్‌కుమార్, ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ శంకర్, డెర్మటాలజీ వైద్యులు డాక్టర్ లెక్కల శ్రీదేవి, డాక్టర్ విజయ కుమారి, డాక్టర్ నీలిమాచౌదరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, డెర్మటాలజీ పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ ఆచారి పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల న్యాయ సేవా సమితి, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన టిఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ ఆచారి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అక్కడ నుంచి ర్యాలీ పట్టణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాది విసి.గంగాధర్ కుమార్, ప్యారా లీగల్ వాలంటీర్ బి.నరసింహ నాయుడు, కోర్టు టైపిస్ట్ ఎస్.సాదిక్ వలి, ఐసిటిసి కౌన్సిలర్ వెంకటేశులు, ల్యాబ్ టెక్నీషియన్ అమర్నాథ్, టిఐ ప్రాజెక్టు మేనేజర్ జి.రమేష్, ఎంఇఎ ఆర్.సందీప్ కుమార్, ఎఎన్ఎం డి.కవిత, ఓఆర్ డబ్ల్యులు డి.కృష్ణవేణి, షేక్ శంషాద్, జి.రాధాకుమారి, ఆర్.జోష్న, జి.లావణ్య, పి.జోష్న, నర్సులు,ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, పిఇ లు, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఉరవకొండ : ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఉరవకొండ కోర్టు జడ్జి దుర్గా కళ్యాణి పిలుపునిచ్చారు. ఉరవకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఐసిటిసి ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆసుపత్రి నుంచి వైఎస్ఆర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ వైద్యులు ఇస్మాయిల్, భరత్, వినీత, ఐసీటీసీ కౌన్సిలర్ రవిప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ కైలాసం, యమున, డిపిఎంఇ తిప్పయ్యస్వామి, రిడ్స్ ఓఆర్‌డబ్ల్యు షకీలా, లింకు వర్కర్స్ నాగరాజు, నాగేంద్ర, తిప్పమ్మ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ కె.పుష్పలత హెచ్ఐవిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ వెంకటపతి, వహీదా బేగం, ఆస్పత్రి సిబ్బంది, నర్సులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో మండల వైద్యాధికారి గౌతమి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మంజుల, సిహెచ్ఒ లోకనాథ్, ఆరోగ్య విస్తారణాధికారి నాగేశ్వరయ్య, పిహెచ్ఎన్ అరుణ, సూపర్‌వైజర్లు కృష్ణమోహన్, ఎంఎల్‌హెచ్‌పి గాయత్రి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ఐసీటీసీ విభాగం మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని వినాయక కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞానసుధ వైద్యులు మోహన్‌సాయి, రమేష్, ల్యాబ్ టెక్నీషియన్లు అల్తాఫ్, సురేష్‌బాబు, శ్రీనివాసులు, మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ సిబ్బంది లోకేష్, శ్రీకాంత్ నాయక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, విద్యార్థులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ అధికారి రాజేష్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిడ్స్ ఎన్‌జిఒ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్, హాస్టల్ వార్డెన్ నాగరాజు, ఐసిటిసి ఈశ్వరయ్య, టిబి సిబ్బంది, రిడ్స్ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


కణేకల్లు : మండల కేంద్రంలోని ఆర్‌డిటిలో వైద్యుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, కిరణ్‌కుమార్, సాధన. సింధు, మేనేజర్ నాగరాజు, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ ఫజులు, కౌన్సిలర్ వరలక్ష్మి, నరేంద్ర, అశోక్, సిస్టర్ ఉమా, సుమ, ఆర్‌డిటి సిబ్బంది పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మెడికల్ కళాశాల విద్యార్థినులు



కణేకల్లులో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

పరిహారం చెక్కు అందజేత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇటీవల మండలంలోని విద్యుదాఘాతంతో మృతిచెందిన కోమటికుంట్ల గ్రామానికి చెందిన చెరుకూరి తిరుపతినాయుడు భార్య శాంతమ్మకు ఆదివారం అనంతపురం నగరంలోని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ క్యాంపు కార్యాలయంలో రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వరకుమార్, ఎస్ఇ సంపత్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులు, ఎఇ చంద్రశేఖర్, కోమటికుంట్ల ప్రజలు పాల్గొన్నారు.

చర్చిల్లో ఆరాధన

పామిడి : మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం క్రీస్తు ఆరాధనలు ఘనంగా నిర్వహించారు. పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకానికి వచ్చాడని సిఎస్ఐ చర్చి పాస్టర్ విశ్వ మోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఐ చర్చి సెక్రటరీ పరదేశి విజయ శేఖర్‌రాజు, వీరయ్య, జయరాజు, జకరయ్య, బుజ్జిబాబు, రాజు, కరుణాకర్, అబ్రహం, ప్రసాద్, రజని, దేవమ్మ, ప్రిస్కిల్లా, డాక్టర్ కమల, రేచెల్, వాణి, మెర్సీ, మహిమ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని ఓబుళాపురం గ్రామంలో నిర్మించిన నల్లలమ్మ ఆలయానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.25వేలు విరాళం అందజేశారు. ఈనెల 5న నల్లలమ్మ ఆలయం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు విరాళం అందజేశారు.

గుంతలకు మరమ్మతులు

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం రూరల్ చిన్నంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పరిటాల రవీంద్ర నగర్‌లో గుంతలమయమైన రోడ్లకు టిడిపి నాయకుడు మంగళ రాము సొంత డబ్బులతో ఆదివారం మరమ్మతులు చేయించారు. ఇందులో భాగంగా ట్రాక్టర్లతో మట్టిని తోలించి గుంతలను పూడ్చివేశారు.

మాదిగల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మాదిగల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మార్పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు, రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ అన్నారు. ఆదివారం జిల్లాకు వచ్చిన సందర్భంగా ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పిఎస్ రాష్ట్ర కమిటి చైర్మన్ బిసిఆర్.దాస్, ఎంఇఎఫ్ జాతీయ నాయకులు అమర్, మధు, హరిగోపాల్ వారికి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు తరువాత ఉద్యోగాలు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ నాయకులు సూరి, జేసి శేఖర్, శివ, భూదెప్ప, మలరాముడు, రామాంజి, ఈరన్న, రాము, చిరంజీవి, నాగేంద్ర, రాజు, మల్లె, శంకర్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు



సంఘీభావం తెలుపుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పోతుల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం

బిసిలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ సాధనకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని రాజ్యాంగ పరిరక్షణ సమితి (ఆర్‌పిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని యాదవ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 2వవారంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని బహుజన ప్రజాప్రతినిధులను సన్మానించనున్నన్నట్లు తెలిపారు. ముఖ్యంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం బిసిలకు చట్టసభలు, ఉన్నత న్యాయస్థానాల్లో, జనాభా దామాషా ప్రకారం ప్రయివేటు, కార్పొరేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిఎస్ నాయకులు బాలరాజు, ఉజ్వల్ యుగంధర్, హేమంత్, ఆర్ఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఆర్.నారాయణనాయక్, ఉపాధ్యక్షులు మావిటి శ్రీరాములు, పి.సురేంద్ర, ఆర్.మల్లికార్జున, రాష్ట్ర నాయకులు కె.వరప్రసాద్, యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆదినారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రాజారమేష్, సిపిఎస్ఇఎ జిల్లా అధ్యక్షులు గోపాలప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎన్.రాఘవేంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.నాగభూషణం, ఆర్.మహేష్‌నాయక్, డి.వరదరాజులు, సన్నప్ప, ఎం.జైపాల్, ఆర్.నాగేంద్ర, వి.రామకృష్ణ, జి.శివశంకర్, రాజశేఖర్, కుళ్లాయప్పనాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పోతుల నాగరాజు

హామీల అమలుకు ఉద్యమిస్తాం

ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘురామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యారంగం సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం ఐక్యంగా ఉద్యమిస్తామని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎన్.రఘురామిరెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జిల్లా సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు 117 జిఒ రద్దు, 12వ పిఆర్సి, ఫిట్‌మెంట్ అమలు, ఆలస్యమైతే మెరుగైన మధ్యంతర భృతిని అందిస్తామని హామి ఇచ్చారు వాటిని అమలు చేయాలన్నారు. బకాయి పడ్డ పిఎఫ్ లోన్లు, ఎపిసిఎల్ఐ లోన్లు నగదు సంపాదిత సెలవులు అన్ని రకాల ఆర్థిక సౌలభ్యాలు కల్పించాలన్నారు. అపార్ టైం టేబుల్ ఆవాస శిక్షణ కార్యక్రమాల నూతన యాప్‌ల విధులు, ఉపాధ్యాయులపై రుద్దుతూ బోధనేతర పనులతోనే కాలయాపన చేస్తూ సకాలంలో సిలబస్ పూర్తి కాని దుస్థితి నెలకొందన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు మోహన్ రెడ్డి, సతీష్ కుమార్, కార్యదర్శులు రామాంజనేయులు, నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు